# వీలునామా చెల్లుబాటు

తండ్రి సంపాదించిన ఆస్తికి బిడ్డలు హక్కుదారులు, లేక వారసులు గనుక తండ్రి తన ఆస్తిని బిడ్డల పేరున వీలునామా వ్రాస్తాడు. తండ్రి చనిపోయిన తరువాతనే వీలునామా అమలు అవుతుంది. వీలునామాలో నా తదనంతరము నా బిడ్డలకు చెందుతుంది అని వ్రాస్తాడు. వీలునామా చెలామణి అవ్వాలి అంటే తండ్రి చనిపోవాలి. వీలునామాను ఎవరు రద్దుచేయలేరు. వీలునామా రద్దుకావాలి అంటే, వీలునామాను వ్రాసినవారే రద్దుపరచాలి. అప్పుడే అది రద్దు అవుతుంది. ఇది భౌతికమైన నిబంధన, కట్టడ.ఆధ్యాత్మికముగా సృష్టికర్తయైన దేవుడు(యేసుస్వామి) కూడ తన బిడ్డలకు వీలునామాను వ్రాసాడు. ఆ వీలునామా అమలుకావాలి అంటే వీలునామా వ్రాసిన "యేసు క్రీస్తు" మరణించాలి. అప్పుడు వీలునామా అమలులోనికి వస్తుంది. మరణ శాసనమెక్కడ ఉండునో అక్కడ మరణ శాసనము వ్రాసినవాని మరణము అవశ్యము. ఆ శాసనము వ్రాసినవాడు మరణము పొందితేనే అది చెల్లును. అది వ్రాసినవాడు జీవించుచుండగా అది ఎప్పుడైనను చెల్లునా?(హెబ్రీ 9: 16) ఆదిమానవులు చేసిన పాప ఫలితమును వారి సంతానమైన మానవులందరు  అనుభవించవలసివచ్చెను. పాత నిబంధన కాలములో పాపపరిహారము కొరకు అనేక రకములైన బలులు అర్పించిరి.

1. దహన బలి, 2. సమాధాన బలి, 3. పాపపరిహారార్ధ బలి, 4. అపరాధ పరిహారార్ధ బలి, 5. నైవేద్యములు. యేసుక్రీస్తు మరణము ద్వారా ఈ బలుల నెరవేర్పు జరిగినది గనుక బలులు అర్పించవలసిన పని లేదు. "మేకల యొక్కయు, కోడెల యొక్కయు రక్తములతో గాక తన స్వరక్తములతో ఒక్కసారే పరిశుద్ధ స్థలములో ప్రవేశించెను (హెబ్రీ 9: 12). యేసుక్రీస్తు సిలువ మరణము ఎందుకు పొందవలసి వచ్చెను? ఆ మరణము ద్వారా మనుష్యులు పొందుకొన్న ఆశీర్వాదములు, మేలులు ఏమిటో పరిశుద్ధాత్ముని సహాయము వలన తెలుసుకొందాము.

యేసుక్రీస్తు మరణము వలన వీలునామా చెల్లుబాటు అగుట మాత్రమే గాక అనేక ఆశీర్వాదములు లభించెను.

## 1. పాపమునకు పరిహారము

ఆదిమానవులైన ఆదాము, అవ్వలు చేసిన పాపము (ఆజ్ఞ అతిక్రమము) వలన కలిగిన ఫలితము మానవులందరికి సంప్రాప్తమాయెను. ఆ పాపఫలితము వలననే మానవులందరు పాపుల జాబితాలో చేర్చబడిరి. "ఏ భేధమును లేదు అందరును పాపముచేసి దేవుడు అనుగ్రహించు మహిమను పొందలేకపోవుచున్నారు" (రోమా 3: 23). "పాపము చేయక మేలు చేయుచుండు నీతిమంతుడు భూమి మీద ఒకడైనను లేడు" (ప్రసంగి 7 : 20). పాపమునకు పరిహారము కావాలి అంటే రక్తప్రోక్షణ జరుగాలి. "సర్వపాప పరిహారో రక్తప్రోక్షణ మవశ్యకమ్( తద్ రక్తమ్ ( పరమాత్మేనపుణ్యదాన బలియాగం" అని హైందవ గ్రంధాలు ఘోషించుచున్నవి. మేకల యొక్కయు,కోడెలయొక్కయు రక్తము కాదు. భగవంతుడే ఉచితముగా తన రక్తమును దానము చేయాలి. అలా చేసినవాడు యేసుక్రీస్తు మాత్రమే. "మనయతి క్రమ క్రియలను బట్టి అతడు గాయపరచబడెను. మన దోషములను బట్టి నలుగగొట్ట బడెను (యెషయ 535). మనము పాపముల విషయమై చనిపోయి నీతి విషయమై జీవించునట్లు ఆయన తానే తన శరీరమందు మన పాపములను

మ్రానుమీద మోసికొనెను (1 పేతురు 2 : 24). యేసురక్తము ప్రతిపాపమునుండి మనలను పవిత్రులనుగా చేయును. (1 యోహాను 1:7). యేసుక్రీస్తు మరణించి యుండకపోతే పాపియైన మానవునికి తన పాపములకు పరిహారము కలిగేది కాదు! "ఆయన సిలువ మరణమే పాపములకు పరిహారము" లభించుటకు కారణమాయెను.

## 2.విమోచన

విమోచన అనగా విడిపించబడుట, తప్పించబడుట అను భావము. "దేవుని కృపామహదైశ్వర్యమును బట్టి ఆ ప్రియుని యందు, ఆయన రక్తమువలన మనకు విమోచనము అనగా మన అపరాధములకు క్షమాపణ మనకు కలిగియున్నది. ధర్మశాస్త్రము యొక్క శాపము నుండి విమోచించెను. (గలతి 3: 14) ధర్మశాస్త్రము పాపమును చూపించగలిగినది గాని పాపము నుండి విడుదల కలిగించలేకపోయెను "విమోచన" అను మాటకు గ్రీకు భాషలో 1. అగారజో : అనగా బానిసలను మార్కెట్లో అమ్ము చుండెడివారు. అట్లు అమ్మబడుచున్న బానిసను వెల ఇచ్చి కొని ఆ బానిసత్వము నుండి బయటకు తెచ్చుట. మనందరము పాపమునకు బానిసలమై యుండగా యేసుక్రీస్తు తన రక్తమును క్రయధనముగా చెల్లించి మనలందరిని కొనెను (1 కొరింథి 6 : 20, 1 పేతురు 1: 18,19). 2. ఎక్స అగోరాజో : కొనబడిన బానిసను మరలా బానిసల మార్కెట్ కు అమ్ముటకు వీలు లేకుండ కొనుట అను భావము. 3. "లోట్రూ" : బానిసగా ఉన్నవానిని కొని బానిసకట్లు తెంపి ఇక వాని పై బానిసత్వమునకు ఎట్టి అధికారము లేకుండా సంపూర్ణముగా విడిపించి స్వేచ్ఛనిచ్చుట అను భావము. యేసుక్రీస్తు ఇట్టి విమోచన కార్యము చేయకపోతే ఆయన రాసిన వీలునామా చెల్లుబడి కానేరదు. ఆ వీలునామా చెల్లుబడి అగునట్లు"సిలువ మరణము" పొంది మనపట్ల "విమోచన కార్యము" జరిగించెను. యేసుక్రీస్తు సిలువ ద్వారా మరణము పొందుట "పాపశాపముల నుండి" మానవులకు విమోచన లభించెను (ఎఫెసి 1:7).

## 3. సమాధానము

ఆదాము, హవ్వలు పావము చేయుట ద్వారా దేవుని సమాధానమును పోగొట్టుకొనిరి. దాని ఫలితమే అసమాధానము మనుష్యులను పాలన చేస్తుంది. కావున కుటుంబాలలో, వ్యక్తుల మధ్య అసమాధానము బలముగా పనిచేసి కుటుంబాలను విచ్చిన్నము చేయుచున్నది. మొదటిగా మనుష్యుడు దేవునితో సమాధానము, రెండవదిగా మనుష్యుల మధ్య మనుష్యులకు, మూడవదిగా వ్యక్తిగతముగా తమలో తమకే సమాధానమును మానవులు కోల్పోయినారు. మానవులు కోల్పోయిన సమాధానమును స్థాపించుటకు సమాధానకర్తయైన యేసయ్య సిలువ మరణము పొందవలసి వచ్చెను. ఆయన యందు సర్వ సంపూర్ణత నివసింపవలెననియు ఆయన సిలువ రక్తము చేత సంధిచేసి ఆయన ద్వారా సమస్తమును అవి భూలోకమందున్న వైనను, పరలోక మందున్నవైనను వాటినన్నింటిని ఆయన ద్వారా తనతో సమాధానపరచుకొన వలెననియు తండ్రి అభీష్టమాయెను మరియు గత కాలమందు దేవునికి దూరస్థులును మీ దుష్ క్రియల వలన మీ మనస్సు విరోధ భావము గలవారునై యుండి మిమ్మును కూడ తన సన్నిధిని పరిశుద్ధులుగాను, నిర్దోషులుగాను, నిరపరాధులుగాను నిలువబెట్టుటకు ఆయన మాంసయుక్తమైన దేహమందు

"మరణము వలన" ఇప్పుడు మిమ్మును సమాధానపరచెను (కొలస్సి 1: 19-22, యోహాను 1: 29, రోమా 5: 10, 2వ కొరింథీ 5: 19, ఎఫెసి 2: 16). యేసుక్రీస్తు మరణము వలన వీలునామ అమలుచేయబడి "సమాధానము" లభించెను.

## 4. శత్రువులు మిత్రులుగా మార్చబడుట

యేసు మరణము శత్రువులను మిత్రులుగా మార్చింది. ఏలయనగా శత్రువులమై యుండగా ఆయన కుమారుని మరణము ద్వారా మనము దేవునితో సమాధాన పరచబడినయెడల సమాధాన పరచబడిన వారమై ఆయన జీవించుటచేత మరి నిశ్చయముగా రక్షించబడుదుము (రోమా 5:10). హేరోదును, పిలాతును ఒకరికొకరు శత్రువులైయుండిరి (లూకా 23:12). అట్టి శత్రువులను మిత్రులుగా చేయుటకే యేసుక్రీస్తు సిలువ మరణము పొందవలసివచ్చెను. ఆయన మరణము ఎంత విలువైనదో కదా! ఆయన ఈ లోకములో జీవించిన కాలములో చెప్పినమాట "నేను మీతో చెప్పునదేమనగా మీరు పరలోకమందున్న మీ తండ్రికి కుమారులై యుండునట్లు మీ శత్రువులను ప్రేమించుడి, మిమ్మును హింసించు వారికొరకు ప్రార్థన చేయుడి (మత్తయి 5:44). శత్రు స్వభావము తొలగించి మిత్రభావమును స్థిరపరచుటకు యేసుక్రీస్తు సిలువ మరణము పొందవలసి వచ్చెను. ఆయన మరణించుట ద్వారా శత్రు స్వభావము తొలగి మిత్ర స్వభావము ఏర్పడెను.

## 5. సమీపస్తులుగా చేయబడుట

పాపమే మనుష్యులను దేవునికి దూరము చేసెను. దేవునికి దూరమైన మానవులను దగ్గరకు చేర్చుకొనుటకు ప్రేమతో ఆహ్వానించెను (మత్తయి 11 : 28; యెషయ 65 : 2). మానవులు పాపముల చేతను అపరాధముల చేతను చచ్చి దేవునిని సమీపించలేక ఆయనకు దూరముగా జీవించుచుండగా, అట్టి మానవులను తనకుదగ్గరగా చేసుకొనుటకు యేసుక్రీస్తు ప్రేమపూర్వకముగా తన దగ్గరకు రమ్మని ఆహ్వానించెను గాని మానవులు ఆ ఆహ్వానమును నిర్లక్ష్యము చేసి పతనానికి దిగిపోవు చుండగా ఆ నరకగోతి నుండి మానవులను తప్పించుటకు యేసుక్రీస్తు మరణించవలసి వచ్చెను". ఆ మరణము మానవులను దేవునికి సమీపస్తులనుగా చేసెను. ఇశ్రాయేలుతో సహపౌరులుకాక పరదేశులును వాగ్దాన నిబంధనలు లేని పరజనులును, నిరీక్షణ లేనివారును లోకమందు దేవుడు లేనివారునై యుండి క్రీస్తుకు దూరస్థులై యుంటిరని మీరు జ్ఞాపకము చేసుకొనుడి. అయినను మునుపు దూరస్థులైన మీరు ఇప్పుడు క్రీస్తుయేసు నందు క్రీస్తు రక్తము వలన సమీపస్థులై యున్నారు అని పౌలు తెలియజేయుచున్నాడు (ఎఫెసి 3: 12-13). ఈ మాట అన్య జనాంగమును గూర్చి చెప్పబడినది. వారి స్థితి: 1. సున్నతి లేనివారు, 2. పరదేశులు, 3. వాగ్దాన నిబంధనలు లేనివారు, 4. నిరీక్షణ లేనివారు, 5. నిర్దేవులు. పై కారణములను బట్టి దేవునికి దూరస్థులై యుండిరి (ఎఫెసి 3 : 13). యెషయా 57 : 19 ప్రకారము "దూరస్థులకును, సమీపస్థులకును సమాధానము సమాధానమని చెప్పబడిన ప్రవచనము క్రీస్తునందు నెరవేరినది. మునుపు దూరముగా నున్న ప్రజలు క్రీస్తు రక్తమువలన అనగా ఆయన సిలువ మరణము వలన సమీపస్తులైరి". ఆయన మరణము వలన లభ్యమైన భాగ్యము ఆయనకు సమీపముగా చేయబడుటయే.

## 6. నీతిమంతులు

నీతి మంతుడైన దేవుడు తన ప్రజలు నీతి కలిగి జీవించాలని ఆశించి తన పోలిక, తన స్వరూపమందు నరులను సృజించెను. దేవుడు నరులను యదార్థ వంతులునుగా పుట్టించెను గాని వారు వివిధమైన తంత్రములు కల్పించుకొని యున్నారు (ప్రసంగి 7: 29). పాపము చేయక మేలు చేయుచుండు నీతిమంతుడు భూమిమీద ఒక్కడైనను లేడు (ప్రసంగి 7:20). దేవుడు ఆశించినట్లు మనుష్యులు జీవించలేదు. అందుకే "మిమ్మును బట్టియే గదా దేవుని నామము అన్యజనుల మధ్యను దూషించబడు చున్నది (రోమా 2 : 24). అని పౌలు భక్తుడు తెలియజేయుచున్నాడు, మనుష్యులు నీతిమాలిన  పనులు చేసి నీతిమాలిన జీవితమును జీవించుచున్నారు. వారు దేవుని నీతిని ఎరుగక తమ స్వనీతిని స్థాపింపబూనుకొనుచు దేవుని నీతికి లోబడలేదు (రోమా 10:3). అందుకే నీతిమంతుడు లేడు ఒక్కడైనను లే డు అని పౌలు తెలియజేయు చున్నాడు (రోమా 3 : 11). అనీతిమంతులను నీతిమంతులునుగా చేయుటకు యేసుక్రీస్తు మరణించెను "ఆయన మరణము మానవులను నీతిమంతులునుగా చేసింది". క్రీస్తుయేసు రక్తమందలి విశ్వాసము ద్వారా ఆయనను కరుణాధారముగా బయలుపరచెను. దేవుడిప్పటికాలమందు తన నీతిని కనుబరచు నిమిత్తము తాను నీతిమంతుడును యేసునందు విశ్వాసము గలవానిని నీతిమంతునిగా తీర్చువాడునై యుండుటకు ఆయన ఆలాగు చేసెను (రోమా 3:26).

## 7. పరిశుద్ధస్థల ప్రవేశము

ప్రత్యక్ష గుడారము 3 భాగములు కలది. 1. ఆవరణము 2 పరిశుద్ధ స్థలము 3. అతి పరిశుద్ధ స్థలము. ఆవరణములోనికి అందరు రావచ్చు. పరిశుద్ధ స్థలములోనికి యాజకులకు మాత్రమే ప్రవేశము. అతి పరిశుద్ధ స్థలములోనికి ప్రధాన యాజకునికి మాత్రమే ప్రవేశము. ఆవరణము లోనికి వచ్చిన ప్రజలు తీసుకొని వచ్చిన బల్యర్పణలను యాజకులు పరిశుద్ధ  స్థలము లోనికి తీసుకువచ్చెడివారు. యాజకులు తెచ్చిన బల్యర్పణ రక్తమును ప్రధానయాజకుడు ప్రజల పక్షముగా తీసుకొని అతిపరిశుద్ధ స్థలములోనికి వెళ్ళి రక్తప్రోక్షణ జరిగించెడివాడు. ప్రధాన యాజకుడు మాత్రమే సంవత్సరము నకు ఒక్కసారి వెళ్ళెడివాడు. "యేసుక్రీస్తు సిలువ మరణము పొందుటనుబట్టి అడ్డుగా ఉన్న తెర చిరిగి పోయెను. ఆ అడ్డుతెర చిరిగిపోవుటను బట్టి పరిశుద్ధ స్థలములోనికి ప్రవేశము అందరికి లభించెను" (మత్తయి 27:51).

యేసు మనకొరకు ప్రతిష్ఠించిన మార్గము అనగా నూతనమైనదియు, జీవము గలదియు ఆయన శరీరము అను తెరద్వారా యేర్పరచబడినదియునైన మార్గమును ఆయన రక్తము వలన పరిశుద్ధ స్థలమునందుప్రవేశించుటకు మనకు ధైర్యము కలిగియున్నది గనుక దేవుని ఇంటి పైన మనకు గొప్ప యాజకుడున్నాడు (హెబ్రీ 10 : 19). ఆయనే ప్రధాన యాజకుడై న యేసుక్రీస్తు. యేసుక్రీస్తు మరణము వలన పరలోక ప్రవేశము లభించెను. "నేనే మార్గము... నా ద్వారానే తప్ప యెవడును తండ్రియొద్ద కు రాడు. నేను వెళ్ళి మీ కు స్థలము సిద్ధపరచినయెడల నేనుండు స్థలములో మీరును ఉండులాగున "మరలా వచ్చి నాయొద్ద నుండుటకు మిమ్మును తీసికొని పోదును" (యోహాను 14: 6,3). ఇది ప్రభువు వ్రాసిన వీలునామా. ఆయన చెప్పినట్లు నెరవేర్పు జరుగాలి అంటే ఆయన మరణము ఆవశ్యము. ఆయన

మరణించుటను బట్టియు, ఆయనయందు విశ్వాసముంచుటను బట్టియు పరలోక ప్రవేశము లభ్యమాయెను. గొఱ్ఱెపిల్లయొక్క జీవగ్రంథమందు వ్రాయబడినవారే దానిలో ప్రవేశింతురు గాని నిషిద్ధమైనదేదైనను, అసహ్యమైన దానిని అబద్ధమైనదానిని జరిగించువాడైనను దానిలోనికి ప్రవేశింపనే ప్రవేశింపడు (ప్రకటన 21:27).

## 8. మరణముపై విజయము

మరణము అందరు పొందాలి (కీర్తనలు 89 : 48; ప్రసంగి 8 : 8, 9: 12; 1 రాజులు 2 : 1; ఆది 27 : 1; రోమా 5: 12)

1. శారీరక మరణము : శరీరమునకు, ఆత్మకు ఎడబాటు (ప్రకటన 12 : 1, 2 కొరింథి 5 : 1) ఇది అందరు పొందాలి.

2. ఆత్మీయ మరణము : శారీరకముగ బాగానేయున్నను ఆధ్యాత్మిక స్థితిలో చనిపోయినవారు (ప్రకటన 3:1).

3. శాశ్వత మరణము : ఇదియే రెండవ మరణము “నరకము"(ప్రకటన 21: 8, 20 : 14, 19: 20, మార్కు 9 : 43,48).

ఈ రెండవ మరణమునుండి అనగా “నరకము” నుండి మానవాళిని రక్షించుటకు, రెండవ మరణము ప్రజలను కబళించకుండ ఉండునట్లు “యేసుక్రీస్తు మరణించి" ఆ మరణబలము నుండి ప్రజలను కాపాడెను. జీవిత కాలమంతా మరణ భయముచేత దాస్యమునకు లోబడినవారిని విడిపించుటకు ఆయన కూడ రక్తమాంసములలో పాలివాడాయెను” (హెబ్రి 2 : 15) వ్రాత రూపకమైన ఆజ్ఞల వలన మనమీద ఋణముగాను, మనకు విరోధముగాను నుండిన పత్రమును మేకులతో సిలువకు కొట్టి దానిమీది చేవ్రాతను తుడిచివేసి మనకు అడ్డము లేకుండా దానిని ఎత్తివేసి మన అపరాధములనన్నిటిని క్షమించి ఆయనతోకూడ మిమ్మును జీవింపచేసెను” (కొలస్సి 2:15). "విజయమందు మరణము మ్రింగివేయబడెను" (1 కొరింధి 15 : 54). యేసుక్రీస్తు సిలువ మరణము పొందుట ద్వారా రెండవ మరణమైన నరక శిక్షనుండి మానవులు తప్పించబడిరి. యేసుక్రీస్తు దేవుడని నమ్మి ఆయనయందు విశ్వాసముంచినయెడల, నీవు నరకము నుండి తప్పించబడి నిత్యజీవము పొందగలవు ( యోహాను 5:24). యేసు క్రీస్తు “సిలువ మరణము" పొందుటద్వారా పైన తెలియజేయబడిన ఆశీర్వాదములు, మేలులు మాత్రమే లభ్యమగుట కాక ఆయన వ్రాసిన “వీలునామా” మరనాత. కూడ అమలుపరచబడెను. ఆయన మరణము ఎంత విలువైనదో కదా.........!